క్లుప్తంగా

పెద్ద బాలశిక్ష పుస్తకాల పంపిణీ


పుస్తకాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

పాల్వంచరూరల్: పాండురంగాపురం, ఇల్లెందులపాడుతండా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం భూక్యా లాల్‌సింగ్ జ్ఞాపకార్థం పెద్దబాల శిక్ష పుస్తకాలను ఉపాధ్యాయులు రమేష్ రాథోడ్, ఆయన తనయుడు లెనిన్ రాథోడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్వాల శ్రీనివాసరావు, షాబీర్‌పాషా, బానోతు హుస్సేన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి


జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): వెంకటేశ్వరగని గ్రామవాసులకు త్వరలో కొత్తగూడెం ఏరియాలో ప్రారంభం కానున్న వీకే ఓసీ అప్‌లోడింగ్‌లో ఉద్యోగావకాశాలు కల్పించాలని ఏరియా జీఎం శాలేంరాజుకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం నాయకుడు గాదర్ల కనకయ్య మాట్లాడుతూ.. వీకే–7 పరిధిలో గతంలో తాము వెంకటేశ్వర గని గ్రామ పంచాయతీకి చెందిన వారమని, ఈ ప్రాంతంలో ఎప్పటికైనా ప్రమాదం జరగవచ్చని 2006లో యాజమాన్యం మమ్ములను ఆ గ్రామం నుంచి నష్టపరిహారం చెల్లించకుండా బలవంతంగా వెళ్లగొట్టడం జరిగిందని వాపోయారు. స్పందించిన జీఎం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీడీ శ్రీను, పొన్నాల నారాయణ, కలకోటి ఐలయ్య, లక్ష్మీనారాయణ, విజయ్, సుఫారి, సతీష్, మల్లెష్, గోవిందు, గంజి శ్రీనివాస్, చెంబు రాంచందర్, మెండు రాజ్‌కుమార్, మల్లెష్ పాల్గొన్నారు.

'గుర్తింపు సంఘం విఫలం'

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి గుర్తింపు సంఘంగా ఎన్నికైన ఏఐటీయూసీ కార్మికుల సమస్యల పరిష్కారంలో విఫలం అయిందని, రానున్న ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ గెలుపు ఖాయం ఆ యూనియన్ సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయ జోక్యం వాళ్లే చేసుకుంటూ ఐఎన్‌టీయూసీని విమర్శించటం సిగ్గుచేటని పేర్కొన్నారు. 40 వేల మంది కార్మికుల రక్షణపై ఏఐటీయూసీకి ఉన్న బాధ్యత ఇదేనా అని ఎద్దేవా చేశారు. ఈ సంవత్సరం 35శాతం లాభాల వాటా ఇప్పిస్తామని, సొంతింటి కలను నిజం చేసి చూపిస్తామని పేర్కొన్నారు.

అన్నదాతల అరిగోస

- బురదమయంగా పంట పొలాలకు వెళ్లే దారి
- అవస్థలు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు


బురద రోడ్డులో వెళ్తున్న పశువులు

సుజాతనగర్: బురదమయంగా మారిన దారిలో దిగబడుతున్న ట్రాక్టర్లు, ఎండ్లబండ్లు..
పంట పొలాలకు వెళ్లేందుకు ఒక పక్క రైతుల అవస్థలు.. మరోపక్క గుట్ట ముసలమ్మ తల్లి గుడికి వెళ్లేందుకు భక్తుల ఇబ్బందులు.. వెరసి సింగభూపాలెం గ్రామ పరిధిలోని రైతులు, భక్తులు పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం.

వర్షాకాలంలో తీవ్ర అవస్థలు...
వ్యవసాయ పనులకు వెళ్లేందుకు కర్షకులకు కష్టాలు తప్పడం లేదు. సింగభూపాలెం గ్రామ పరిధిలోని గుట్ట ముసలమ్మ తల్లి గుడి దారి వర్షాకాలంలో బురదమయంగా మారుతుండటంతో పంట చేలకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారు. ఏళ్లకాలం నాడు నిర్మించిన రహదారిని అధికారులు పట్టించుకోకపోవడంతో పంట పొలాల్లోకి వెళ్లేందుకు బురదతో నరకం చూడాల్సి వస్తోంది. సింగభూపాలెం, లైన్‌తండా, బేతంపూడి, చిమ్నాతండా, సర్వారం తదితర గ్రామాలకు చెందిన సుమారు 300 మంది రైతులకు చెందిన వ్యవసాయ భూములు ఈ ప్రాంతంలో ఉన్నాయి. సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగవుతున్నాయి. గుట్ట ముసలమ్మ తల్లి గుడి దారికి రెండు వైపులా సుమారు రెండు కిలోమీటర్ల మేర పంటలు సాగవుతుండగా.. ఏళ్లుగా రహదారి సమస్య రైతులను వేధిస్తోంది. ముఖ్యంగా వ్యవసాయ సీజన్‌లో రైతులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఎరువులు, ఇతర సామగ్రిని తీసుకెళ్లేందుకు బురద రోడ్డులో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు వెళ్లి మందులు చల్లడం, పశువులకు మేత తెచ్చుకోవడానికి రైతులు నానా కష్టాలు పడుతున్నారు. పశువులు, మేకలు, గొర్రెలను మేపేందుకు మేత కోసం జీవాలను గుట్ట ముసలమ్మ గుడి సమీపంలోని గుట్టకు తోలుతుంటారు. మోకాళ్ల లోతు బురదలో సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

భక్తులకూ తప్పని ఇబ్బందులు..
ఈ దారి గుండా వెళితే సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో గుట్ట ముసలమ్మ తల్లి గుడి వస్తుంది. ఈ గుడికి సుమారు వెయ్యేళ్ల చరిత్ర ఉందని భక్తులు చెబుతుంటారు. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా గుట్ట ముసలమ్మ తల్లి విలసిల్లుతుండటంతో ఏటా భక్తులు గుట్ట ముసలమ్మ గుడి వద్దకు వచ్చి మొక్కులు చెల్లిస్తుంటారు. చుట్టుపక్కల గ్రామాలు, మండలాల నుంచి వచ్చే భక్తులకు తిప్పలు తప్పడం లేదు.

అధికారుల నిర్లక్ష్యం...
వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు మట్టి పనుల కింద రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ఉపాధి హామీ పథకంలో అవకాశం ఉంది. అయితే రైతుల కష్టాలను అధికారులు, ప్రజాప్రతినిధులు కనీసం పరిశీలించిన దాఖలాలు లేవని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో అన్నదాతలకు కష్టాలు తప్పడం లేదు. మోకాలిలోతు బురదలో వచ్చిపోయేందుకు అవస్థలు పడుతున్నామని, ఇప్పటికైనా సమస్యకు పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నరకం చూస్తున్నాం...



మోకాలిలోతు బురదలో పంటపొలాల్లోకి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు కూడా దిగబడి కాలినడకనే వెళ్లాల్సి వస్తోంది. అధికారులు మా సమస్యను పరిష్కరించాలి.
– ముసలయ్య, రైతు, సింగభూపాలెం

భక్తులకూ తప్పని ఇబ్బందులు..



ఏటా గుట్ట ముసలమ్మ తల్లిని దర్శించుకునేందుకు మా గ్రామంతో పాటు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా వస్తుంటారు. రెండు కిలోమీటర్ల దూరం బురదలో తీవ్ర అవస్థలు పడుతున్నాం.
– బూరుగు నాగేశ్వరరావు, రైతు, సింగభూపాలెం

ఉద్యమాలతోనే మహిళలకు రక్షణ


మాట్లాడుతున్న లక్ష్మీకుమారి

సూపర్‌బజార్(కొత్తగూడెం): బలమైన ఉద్యమ నిర్మాణంతోనే మహిళలకు రక్షణ అని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి అన్నారు. స్థానిక శేషగిరిభవన్‌లో ఆదివారం ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ కొత్తగూడెం పట్టణ మూడో సభ నిర్వహించారు. ముందుగా సంఘం పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా కర్ణాటకలోని పవిత్ర పుణ్యక్షేత్రం ధర్మస్థలలో మహిళలకు, యువతులపై జరుగుతున్న దారుణ అత్యా, హత్యాకాండలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. వందలాది మంది మహిళలు, యువతులపై అత్యాచారం జరిపి హత్యచేసి పూడ్చి పెట్టారని, ఈ ఘటనలో ఎంతటి వారున్నా కఠినంగా శిక్షించాలని కోరారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. భ్రూణ హత్యలు, అడపిల్లల అమ్మకాలు, మహిళలపై హింస, వివక్ష వంటి దుశ్చర్యలను ఆరికట్టేందుకు పాలకులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారత సాధన, సమాన హక్కులు, 33 శాతం రిజర్వేషన్ అమలు కోసం మహిళా లోకం ఉద్యమ బాట పట్టాలని పిలుపునిచ్చారు. మహిళలను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులపై తిరగబడాలన్నారు. సమాఖ్య నాయకురాళ్లు మునిగడప పద్మ, మేదిని లక్ష్మి, పైడిపల్లి లక్ష్మి, దారా లక్ష్మి, పి.భాగ్యలక్ష్మి, కరిషె రత్నకుమారి, సంపూర్ణ పాల్గొన్నారు.

ఆదివాసీలపై దాడులు ఆపాలి

సింగరేణి(కొత్తగూడెం): ఆదివాసీలపై అటవీ సిబ్బంది దౌర్జన్యాలు, తప్పుడు కేసులను ఖండించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అవునూరి మధు డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని ఇష్టా జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దమ్మపేట మండలం నాగుపల్లి ప్రాంతంలోని భూదాన భూమిని 25 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న ఆదివాసీలపై దమ్మపేట అటవీ అధికారులు దాడులు చేసి తప్పుడు కేసులు పెట్టి అక్రమ నిర్బంధంలోకి తీసుకున్నారని వారిని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎస్‌కే ఉమర్, కుంజా కృష్ణ, ఎన్.సంజీవ్, సత్యనారాయణ, రాఘవులు, ఆదినారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పాత సూరారం గ్రామంలో నూతనంగా నిర్మాణం చేసిన ఆలయాల్లో గంగమ్మతల్లి, ముత్యాలమ్మతల్లి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్ల విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మాజీ మార్కెట్ చైర్మన్ జాలే జానికిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు యర్రంశెట్టి ముత్తయ్య, ఆలయ నిర్మాణ నిర్వాహకులు కూరాకుల వెంకన్న, లావుడ్యా శ్రీను, బానోతు లచ్చిరాం, బొల్లకృష్ణ, జావ్లా, భూక్యా బాహుసింగ్, వెంకన్న, కాపర్తి వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకలు


ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు

జూలూరుపాడు: గిరిజన బంజారుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన తీజ్ ఉత్సవాలను మండలంలోని గిరిజన తండాల్లో ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. పెళ్లి కాని యువతులు, మహిళలు బతుకమ్మ తీజ్ బుట్టలను తలపై పెట్టుకొని మేళతాళాలతో ఊరేగింపు చేశారు. అనంతరం ఆయా గ్రామ సమీపంలోని వాగులు, చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూదన్‌రావు, ధరావత్ బాలాజీ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం ప్రారంభం


బొమ్మనపల్లిలో ఎరువుల దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

టేకులపల్లి: ఎరువుల కోసం రైతులు పడుతున్న కష్టాలు చూసి బొమ్మనపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణం ఏర్పాటు చేసినట్లు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఆదివారం బేతంపూడి సొసైటీ ఆధ్వర్యంలో బొమ్మనపల్లిలో ఏర్పాటు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. బోడు గ్రామంలోనూ త్వరలోనే ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.మల్లీశ్వరి, ఏఓ అన్నపూర్ణ, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ బానోతు రాంబాబు, ఆత్మ చైర్మన్ మంగీలాల్, సీఈఓ ప్రేమాచారి, ఎస్‌ఐ రాజేందర్, సొసైటీ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన
పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలో పర్యటించారు. చుక్కాలబోడు, కుంటల్ల, మద్రాస్‌తండా, బిల్లుడుతండా, చింతలంక, బొమ్మనపల్లి, చంద్రుతండా, శంభునిగూడెం, జి.కొత్తతండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. మాట్లాడుతూ.. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, సీఐ బత్తుల సత్యనారాయణ, ఏఈ గణేష్, ఎస్‌ఐ రాజేందర్, నాయకులు కోరం సురేందర్, రాంబాబు, లక్కినేని సురేందర్, బోడ మంగీలాల్, దేవా పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించాలి


జేకే ఓసీ పని ప్రదేశాలను పరిశీలిస్తున్న వెంకన్న

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బాదావత్ వెంకన్న ఆదివారం ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో పర్యటించారు. నూతన జేకే ఓసీ కోల్ మైన్ ప్రాంతాన్ని సందర్శించి పరిశీలించారు. మాట్లాడుతూ... బొగ్గు ఉత్పత్తి, రవాణా లక్ష్యాలను అధిగమించాలని కోరారు. బొగ్గు రవాణాకు ఎటువంటి ఆటంకం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బొగ్గు రవాణా సామర్థ్యం పెంచే బొగ్గు ఉత్పత్తి అయ్యేలా చూడాలని కోరారు. ఉద్యోగులు రక్షణ పరమైన చర్యలు తీసుకోవాలని, రక్షణతో కూడిన ఉత్పత్తి రవాణా చేయాలన్నారు. అనంతరం జీఎం కార్యాలయంలో ఆయనను జీఎం వీసం కృష్ణయ్య ఘనంగా సత్కరించారు. నూతన జేకే కోల్ మైన్ ప్రాజెక్టు స్థలాలను పరిశీలించి సమీక్షించారు. నూతన ఓసీ పనులు వేగంగా పూర్తి చేసి బొగ్గు రవాణా జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేకే కోల్ మైన్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎ.కృష్ణమోహన్‌రావు, ఏజీఎం ఐఈడీ గిరిధర్‌రావు, ఏరియా సేఫ్టీ అధికారి జాకీర్ హుస్సేన్, డీజీఎం పర్సనల్ తుకారం, రవికుమార్ పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించండి..


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణిలో భద్రతా ప్రమాణాలు పాటించాలని, విచక్షణ లేని ఉత్పత్తి లక్ష్యాలు, సురక్షితం కాని మైనింగ్‌ను నిలిపివేయాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం ఇల్లెందు బీఎంఎస్ కార్యాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు మాధవ్ నాయక్ మాట్లాడుతూ... కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. గుర్తింపు కార్మిక సంఘం ప్రాథమిక భద్రతా సమావేశాలు నిర్వహించటంలో విఫలమైందన్నారు. భద్రతాపరమైన అంశాలపై జేబీసీసీఐలోని అన్ని సంఘాలు సమర్థవంతంగా సలహాలు, సూచనలు ఇవ్వాలన్నదే మా నిబద్ధత అన్నారు. భద్రతను తాకట్టు పెట్టే ఉత్పత్తి లక్ష్యాలపై మేము రాజీలేని పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్మికుల ప్రాణాల కన్నా ముఖ్యమైనది మరొకటి లేదన్నారు. ఈ సమావేశంలో నాయిని సైదులు, పవన్‌కుమార్, లీల కృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను విమర్శించడం గర్హనీయం

ఇల్లెందు: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కోరుతూ భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సుప్రీంకోర్టులో కేసు వేయడాన్ని కొంత మంది సేవాలాల్ సేన పేరుతో విమర్శలు చేయటం శోచనీయమని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొగ్గెల రామస్వామి, లీగల్ అడ్వయిజరీ సభ్యులు ఆరెం పాపారావు, రాష్ట్ర నాయకులు జార కృష్ణ అన్నారు. ఆదివారు వారు మాట్లాడుతూ దొడ్డిదారిన ఎస్టీ జాబితాలో కలపబడిన లంబాడీలు ఆదివాసీల అవకాశాలను కొల్లగొడుతున్నట్లు చెప్పారు. కొంతమంది నాయకులు తెల్లం వెంకట్రావును విమర్శిస్తున్నారని వారికి విమర్శించే నైతికత లేదన్నారు. కోర్టులో కేసు నడుస్తోందని, తీర్పు రాక ముందే ఉలికి పడుతున్నారని తెలిపారు. కొంతమంది లంబాడీ నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు వెంకట్రావును బెదిరిస్తున్నారని, కేసు వెనుక్కి తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. మెట్ల పాపయ్య, ఉండం రాధాకృష్ణ పాల్గొన్నారు.

శ్రావణమాస బోనాల సందడి

శ్రావణమాసం సందర్భంగా ఆదివారం పలు గ్రామాల్లో గ్రామదేవతల జాతర నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బొడ్రాయి, ముత్యాలమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడిపంటలు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్


సింగరేణి(కొత్తగూడెం): రైతుబజార్‌లో బోనాలతో ఆలయానికి వచ్చిన మహిళలు


జూలూరుపాడు: అనంతారంలో శ్రీముత్యాలమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు


టేకులపల్లిలో మేళతాళాలతో బోనాలు తీసుకొస్తున్న మహిళలు

రైతన్నలను కనికరించని వానదేవుడు

- ఎండతీవ్రతకు వడలిపోతున్న మొక్కజొన్న
- వరుణుడి కరుణ కోసం ఎదురుచూపు


కొమరారంలో వడలిపోతున్న మొక్కజొన్న


రాఘబోయినగూడెంలో ఎండుతున్న నారుమడి

ఇల్లెందురూరల్: మండలంలో సాగునీటి వనరులు అంతగా లేకపోవడంతో అత్యధిక విస్తీర్ణం ఆకాశపాయ ద్వారానే సాగవుతోంది. వరుణుడు కరుణిస్తేనే పంటలు పండేది. ప్రస్తుత వానాకాలం వానదేవుడి దోబూచులాటతో పంటల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలతో సంబురపడ్డ రైతులు ఆ తరువాత వర్షాభావ పరిస్థితులతో ఆందోళనకు గురవుతున్నారు. పక్షం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలు మళ్లీ ఆశలు చిగురింపచేశాయి. కానీ తిరిగి వరుణుడు ముఖం చాటేయడంతో ప్రస్తుతం ప్రధానంగా మొక్కజొన్న పంటకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితులు నెలకొన్నాయి.

విత్తనం రెండుమార్లు..
జిల్లాలోనే మొక్కజొన్న ఇల్లెందు మండలంలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతోంది. వరుసగా రెండేళ్ల నుంచి మిర్చి సాగులో నష్టాలు ఎదురవడంతో ఈసారి చాలా మంది రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. బోర్లు, బావులు వంటి నీటివనరులు ఉన్న ప్రాంతాలతోపాటు వర్షాధారిత ప్రాంతాలలోనూ మొక్కజొన్న సాగుకే రైతులు మొగ్గు చూపారు. దీంతో ప్రస్తుత సీజన్‌లో మొక్కజొన్న సాగు 25వేల ఎకరాలకు మించిపోయినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత సీజన్ ప్రారంభంలో తొలకరికి రైతులు మొక్కజొన్న విత్తనాలు విత్తుకున్నారు. ఆ తరువాత వరుణుడి జాడ లేకపోవడంతో విత్తనం మొలకెత్తలేదు. దీంతో చాలామంది రైతులు రెండోసారి విత్తనాలు విత్తుకున్నారు. దీంతో పెట్టుబడి భారం మరింత పెరిగింది.

వరుణుడిపైనే ఆధారం..
మండలంలో ప్రధానంగా మస్సివాగు, ముర్రేడు, చలివాగులు ఉన్నాయి. ముర్రేడు వాగు గుండాల మండలం నుంచి ఇల్లెందు మండలం శివారు ప్రాంతాలను తాకుతూ టేకులపల్లి మండలంలోకి ప్రవేశిస్తుంది. మస్సివాగు మాణిక్యారం గ్రామపంచాయతీలో ప్రారంభమై మస్సివాగు, మిట్టపల్లి, మామిడి గుండాల గ్రామపంచాయతీల మీదుగా బయ్యారం మండలంలోకి చేరుకుంటుంది. మాణిక్యారం గ్రామ సమీపంలో మస్సివాగుపై మాత్రమే చెక్‌డ్యాం నిర్మించారు. ఇది మినహా మండలంలో ఎక్కడా ఒక్క చెక్‌డ్యాం కనిపించదు. అంతేకాకుండా వంద ఎకరాలకు సాగునీటిని అందించే ఒక్క చెరువు కూడా మండలంలో కనిపించదు.

మరోరెండు రోజుల్లో వర్షం కురిస్తేనే..
మండలంలో మొక్కజొన్న పంటకు నీటి తడులు లేక వడలిపోతోంది. విత్తనం నాటి నెల రోజులు గడిచినా మొక్క ఆశించిన మేర ఎదగలేదు. కొద్దోగొప్పో ఎదిగిన మొక్క కూడా ప్రస్తుతం వడలిపోయి ఎండుముఖం పట్టింది. ఈ పరిస్థితి ప్రస్తుతం మండలంలో సుమారు పదివేల ఎకరాల్లో ఉంటుందని రైతులు వాపోతున్నారు. బోర్లు, బావుల కింద సాగు చేసుకునే రైతులు కూడా భూగర్భ జలాలు అడుగంటడంతో ఆందోళనకు గురవుతున్నారు. చివరకు నారుమడులు కూడా నెర్రెలు చాచి ఉండటం రైతులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. మరో రెండు, మూడు రోజుల్లో వరుణుడు కరుణిస్తేనే పంటలు తేరుకునే పరిస్థితి ఉంటుంది. లేదంటే ఈ సీజన్‌లో మొక్కజొన్న రైతు భారీ నష్టాన్ని చవిచూడాల్సి ఉంటుంది.

నిలువునా ఎండిపోతున్నాయి...



తొలకరిలో మక్క విత్తనాలు విత్తినం. వానలు రాక మొలక రాలేదు. నెలరోజుల క్రితం మళ్లీ విత్తినం. పక్షం రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు ఎరువు కూడా వేశాను. అప్పటి నుంచి వరణుడు ముఖం చాటేయడంతో మొక్కలన్నీ వడలిపోతున్నాయి.
– వానం వీరస్వామి, రైతు, మామిడిగుండాల

మొక్కలు పెరగడం లేదు...



ప్రస్తుత సీజన్‌లో వర్షాలు ఆశాజనకంగా కురవకపోవడంతో మొక్కజొన్న ఎదుగుదల లేదు. నీటివనరులు సరిగా లేకపోవడంతో ఆకాశపాయ ఆధారంగా పంటలు సాగు చేస్తున్నాం. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో మొక్కజొన్న తోటలు ఎండుముఖం పట్టాయి.
– మంచె వినయ్, రైతు, కొమరారం

వరుణుడు కరుణిస్తేనే...



బోర్లు వేసుకున్నా విద్యుత్తు కనెక్షన్లు సమస్యగా ఉండటంతో ఆకాశపాయ ఆధారంగానే పంటలు సాగు చేసుకుంటున్నాం. ఎండతీవ్రత కారణంగా ప్రస్తుతం మొక్కజొన్న చేనంతా నిలువునా ఎండిపోతోంది. వర్షం కురిస్తేనే మొక్కలు జీవం పోసుకుంటాయి.
– గుర్రం వసంత్, రైతు, కొమరారం

అనుమతి లేని బార్‌షాపులపై చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెంటౌన్: అధికారులు అనుమతులు లేని బార్ షాపులపై చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎస్టీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మేదర బస్తీలో ఐక్య సంఘాల వేదిక సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అనుమతులున్న బార్‌షాపులు 13 మాత్రమే ఉన్నాయని, కానీ అనుమతులు లని బార్ షాపులు ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. బెల్ట్‌షాపులుకు బార్‌షాపుల్లో లేని మద్యాన్ని తరలిస్తూ అధిక ధరలకు అమ్ముతున్నారన్నారు. దళారులు ఇచ్చే ముడుపులకు ఆశపడి, వారికి సహకరిస్తున్న ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మద్యం సరఫరా, బెల్ట్‌షాపుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పెద్దచెరువుకు సీతారామ నీళ్లు మళ్లించాలి

ఇల్లెందురూరల్: చల్లసముద్రం పెద్దచెరువుకు సీతారామ నీటిని మళ్లించాలని న్యూడెమోక్రసీ ప్రాంతీయ కమిటీ కార్యదర్శి నరాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. విస్తీర్ణంలో అతిపెద్ద చెరువుగా పిలవబడుతున్న చెరువు ఆయకట్టు అధికారికంగా 70 ఎకరాలు మాత్రమేనని వాపోయారు. కేవలం నీటివనరులు సరిగా లేకపోవడం వల్లే సాగు భూములు ఉన్నా చెరువు నీటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొందన్నారు. పెద్ద వర్షాలు వస్తే తప్ప చెరువు అలుగు పడదని, గతంలో మస్సివాగు నుంచి పెద్దచెరువుకు నీటిని మళ్లించాలని ఆందోళనలు చేసినప్పటికీ ఫలితం లేదన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా నలుమూలలా గోదావరి జలాలను మళ్లిస్తున్న ప్రభుత్వం చల్లసముద్రం పెద్దచెరువుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటి మళ్లింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.